
www.prajasakti.com
ప్రజాశక్తి



16న డీఆర్‌సి సమావేశం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ రాక



ప్రజాశక్తి - ఏలూరు
జిల్లా అభివృద్ధి, సమీక్ష కమిటీ (డిఆర్‌సి) సమావేశం ఈ నెల 16వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ, ఎంఎల్‌సీలు, ఎంఎల్‌ఏలు, జిల్లా అధికారులు పాల్గొంటారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, భూసేకరణ, ఆర్అండ్ఆర్, పీడీఎస్, ధాన్యం కొనుగోలు, ఇండస్ట్రియల్ పార్కులకు భూమి లభ్యత, శాంతి,భద్రతలు, పరిపాలనాపరమైన అంశాలపై సమీక్షిస్తారు.

కాస్కో.. ఖాకీ..!

కోడి పందేలకు పందెంరాయుళ్లు సన్నద్ధం
నేడు పది గంటల తర్వాత ప్రారంభానికి సన్నాహాలు
పోలీసుల ప్రకటనలను పట్టించుకోనక్కర్లేద్దంటూ ధీమా
కోర్టు ఆదేశాల అమలుపై పోలీసుల దొంగాట
తెలంగాణ, ఇతర జిల్లాల నుంచి భారీగా పందెంరాయుళ్ల క్యూ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
భోగి రోజు సోమవారం కోడిపందేల ప్రారంభానికి పందెంరాయుళ్లు ఉవ్విళ్లూరుతున్నారు. పందేలను అడ్డుకుంటామంటూ పోలీసుల ప్రకటనలను తేలిగ్గా తీసిపారేస్తున్నారు. కోడి పందేలను అడ్డుకునే దమ్ము పోలీసులకు ఉందా అంటూ పందెంరాయుళ్లు సవాల్ విసురుతున్నారు. సోమవారం ఉదయం పది గంటల తర్వాత పందెం కోళ్ల కాళ్ల దువ్వుతాయని ఘంటాపథంగా చెబుతున్నారు. కోర్టు ఆదేశాల అమలుపై పోలీసులు దొంగాట ఆడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. బరులను ధ్వంసం చేస్తున్నట్లు ఒకపక్క ఫొటోలు తీస్తూ.. మరోపక్క బరుల ఏర్పాటుకు అనధికారికంగా సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పండుగ మూడు రోజులు యథేచ్ఛగా కోడిపందేల నిర్వహణకు ప్రభుత్వం, పోలీసులు పూర్తిగా సహకరిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది. కోర్టు ఆదేశాలను అధికార యంత్రాంగం ఏమాత్రం అమలు చేయని పరిస్థితి. కచ్చితంగా పందేలు జరుగుతాయనే ధీమా ఉండటంతో ఊరూవాడా బరుల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. తక్కువగా లెక్కించినా ప్రతి మండలంలోనూ పది నుంచి 15 బరులు ఏర్పాటు చేసేలా పందెంరాయుళ్లు ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. బరుల వద్ద ఏయే ఏర్పాట్లు చేయాలి.. ఎంతమంది వస్తారు.. వచ్చిన వారికి ఎటువంటి సౌకర్యాలు కల్పించాలన్న పలు అంశాలపై ఇప్పటికే నిర్వాహకులు కసరత్తు పూర్తి చేశారు. గుండాట, మూడు ముక్కలాట సైతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కోడి పందేల్లో పాల్గొనేందుకు తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చేవారితో పట్టణాల్లోని హోటళ్ల గదులన్నీ నిండిపోయినట్లు తెలుస్తోంది. పండుగ మూడు రోజులు ఇక్కడే ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పందెంరాయుళ్లు చేరుకుంటున్నారు. ఏయే బరుల్లో పందెం వేయాలన్న దానిపై ముందుగానే నిర్ణయించుకుంటున్నారు. భీమవరం, ఆకివీడు, ఉండి, దెందులూరు నియోజకవర్గాల్లో రూ.లక్షల్లో పందేలు జరిగే బరులు ఉన్నట్లు చెబుతున్నారు. పెద్ద బరుల వద్ద కార్ల పార్కింగ్‌కు సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు బరుల నిర్వాహకులు ప్రత్యేకంగా సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుంటున్నారు. తొలిరోజు భోగి నాడు తక్కువగా లెక్కించినా రూ.50 కోట్లు మేర పందేలు జరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. పెద్ద పండుగ, కనుమ నాడు భారీగా పందేల జోరు సాగనున్నట్లు చెబుతున్నారు. ఉండి, దెందులూరు వంటి నియోజకవర్గాలు కోడి పందేలకు అడ్డాగా మారుతున్నాయనే చర్చ నడుస్తోంది. రెండు జిల్లాల్లో 47 మండలాలు ఉన్నాయి. మండలానికి పది బరులు ఏర్పాటు చేసినా దాదాపు 470 బరుల్లో కోడిపందేలు జరిగే పరిస్థితి కన్పిస్తోంది. బరుల వద్ద స్థానిక ఎంఎల్‌ఎ, ఎంపీ, అధికార పార్టీ నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. కోర్టు ఆదేశాల నుంచి తప్పించుకునేందుకు పోలీసులు హడావుడి చేస్తుండటమే తప్ప.. పందేలకు పూర్తిగా సహకరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.



ముదినేపల్లి తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాట్లు

జూదాలకు ఆకర్షితులవుతున్న యువత

కోడి పందేల నిర్వహణ ఏయేటికాయేడు పెరుగుతోంది. ఇదంతా పక్కాప్రణాళిక ప్రకారమే జరుగుతోంది. గతంలో ప్రభుత్వాలు అనుమతిస్తాయా, లేదా అనే ఉత్కంఠ భోగి రోజు ఉదయం 11 గంటల వరకూ కొనసాగేది. కోడిపందేల నిర్వహణపై పందెంరాయుళ్లు కోర్టులకు వెళ్లిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కోడి పందేలను ప్రభుత్వాలే ప్రోత్సహిస్తున్నాయి. పండుగ మూడు రోజులు పందేలకు ఇబ్బంది ఉండదనే సంకేతాలను ప్రభుత్వం ముందుగానే ఇస్తోంది. కోడి పందేలకు యువత ఆకర్షితులై జేబులు గుల్ల చేసుకుంటున్నారు. సరదాగా చూద్దామంటూ వెళ్లి బెట్టింగ్‌లు కాస్తున్నారు. సామాన్యులు గుండాట, మూడు ముక్కలాటల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. పండుగకు సరదాగా కుటుంబంతో గడపకుండా పందేల బరుల చుట్టూ ఉంటున్న పరిస్థితి ఉంది. యువత పక్కదారి పట్టే పరిస్థితులను ప్రభుత్వమే కల్పిస్తోంది. కోడిపందేలను అడ్డుకునేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయకపోవడమే దీనికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు.

సంక్రాంతి కొత్త వెలుగులు నింపాలి

మంత్రి కొలుసు పార్థసారథి



సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలి. జిల్లా ప్రజలందరికీ, ప్రజాప్రతినిధులకు, అధికారులకు సంక్రాంతి శుభాకాంక్షలు.

సంక్రాంతి ఆనందం నింపాలి

కలెక్టర్ వెట్రిసెల్వి



జిల్లా ప్రజలందరికీ, ప్రజాప్రతినిధులకు, అధికారులకు సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆనందం నింపాలి.

సంతోషానికి చిహ్నం.. సంక్రాంతి

జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్



జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులకు, పోలీసు సిబ్బంది అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ పండుగ సంతోషం, శాంతి, సామరస్యానికి చిహ్నం. ప్రతిఒక్కరి జీవితాల్లో ఆనందం, సుభిక్షత నింపాలని ఆకాంక్షిస్తున్నా.

విద్యుత్ భారాలను నిరసిస్తూ..

నేడు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి




మాట్లాడుతున్న రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
విద్యుత్ భారాలకు నిరసనగా సోమవారం భోగి రోజున భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి తమ నిరసన పెద్దఎత్తున తెలపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశంలో ఎ.రవి మాట్లాడుతూ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని వ్యతిరేకించి, విద్యుత్ ఛార్జీలు పెంచబోమని వాగ్దానం చేసిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాన్ని మోపిందని విమర్శించారు. ప్రపంచమే సిగ్గుపడే పద్ధతిలో అదానీ ఒప్పందం ఉందని అమెరికా వాళ్లు అదానీపై కేసు పెట్టినా రాష్ట్ర ప్రభుత్వం సెకీ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోకుండా ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి పగులగొట్టిన తెలుగుదేశం నాయకులు అవే స్మార్ట్ మీటర్లను బిగించడం సిగ్గుచేటన్నారు. ఫలితంగా ప్రజలు నేడు కరెంట్ బిల్లులు పట్టుకుంటేనే షాక్ కొట్టే పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. తెలుగు రాష్ట్రాల్లో భోగి పండుగ అత్యంత ముఖ్యమైనదని, ఈ పండుగ రోజున ఇంట్లో ఉండే పాత, పనికిరాని, నష్టం కల్గించే వస్తువులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసే ఆనవాయితీ ప్రజల్లో ఉందని గుర్తు చేశారు. ప్రజలకు నష్టం కల్గించే విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి ప్రభుత్వ విధానాలను ప్రజలంతా ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.రామకృష్ణ, నాయకులు గుడిపాటి నరసింహారావు, పి.ఆదిశేషు, కె.లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు పెద్దపీట

స్వచ్ఛ ఏలూరే అందరి లక్ష్యం కావాలి
డివైడర్లకు పెయింటింగ్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, జెసి, ఎంఎల్‌ఎ


ప్రజాశక్తి - ఏలూరు సిటీ
స్వచ్ఛభారత్‌లో భాగంగా 'మన ఏలూరు.. మన పరిశుభ్రత' అనే కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగర సుందరీకరణలో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబుతో పాటు పలువురు వాలంటీర్లు, పోలీస్ సిబ్బంది డివైడర్లకు పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి జెడ్‌పి కార్యాలయం వరకూ చేపట్టిన ఈ కార్యక్రమానుద్దేశించి ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ మన ఏలూరు.. మన పరిశుభ్రత కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మన నగరాన్ని సుందరీకరణ చేసుకోవాలన్నారు. నగరాన్ని ఆహ్లాదకరంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఇష్టానుసారంగా వాల్‌పోస్టర్లు అతికించడం, రాతలు రాయడం వంటి పనులను ఆపాలని, లేనిపక్షంలో మొదటి విడతగా జరిమానా విధిస్తారని, రెండోసారి కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నగర అభివృద్ధి, సుందరీకరణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఏలూరుగా హేలాపురి నగరాన్ని తీర్చిదిద్దే కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఎస్‌పి కెపిఎస్.కిషోర్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్నటు ప్రాంతం పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యవంతమైనటువంటి సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ, చెత్తశుద్ధి పనుల్లో దేశానికే ఏలూరు నగరం ఆదర్శంగా నిలిచేలా ప్రతిఒక్కరూ పాటుపడలన్నారు. కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, సిఐలు కోటేశ్వరరావు, లక్ష్మణరావు, అధికారులు ఎన్.రామారావు, సిహెచ్‌వి.మూర్తి, వి.తాతబ్బాయి, సాంబశివరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పెయింటింగ్‌లో కలెక్టర్, ఎంఎల్‌ఎ, ఎస్‌పి, జెసి

మినీ గోకులాలతో రైతులకు ఆర్థిక భరోసా

మంత్రి కొలుసు పార్థసారథి



మినీ గోకులాన్ని ప్రారంభించిన మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు
పాడి రైతులకు ఎంతో అవసరమయ్యే గోకులాలను గత ఐదేళ్ల వైసిపి పాలనలో కేవలం 268 నిర్మిస్తే కూటమి ప్రభుత్వం కేవలం ఆరు నెలల కాలంలోనే 12,500 నిర్మించిందని, ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో నిర్మించిన గోకులంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశు సంపదను రక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ 90 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. జాతీయ ఉపాధి హామీలో భాగంగా ఈ మినీ గోకులం షెడ్లను నిర్మించారని తెలిపారు. మినీ గోకులాలతో రైతులకు ఆర్థిక బాసట, ఉపాధి లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత

3 సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించిన మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్
సురక్షిత ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నుంచి హైదరాబాద్‌కు మూడు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులను ఆయన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో కలిసి స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం గత ఐదేళ్లల్లో ఒక్క కొత్త బస్సు కూడా కొనుగోలు చేయలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే 1400లకు పైగా కొత్త బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఎంతో మంది నూజివీడు నుంచి హైదరాబాద్‌కు వెళ్తుంటారని, వారి సౌకర్యార్థం కొత్త బస్సులను ప్రారంభించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నూజివీడు నుంచి ఎనిమిది కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్‌కు తొమ్మిది, బెంగుళూరుకు రెండు బస్సులు, నూజివీడు నుంచి విజయవాడ నాన్ స్టాఫ్ ఒక బస్సు, ఆగిరిపల్లి నుంచి హైదరాబాద్‌కు ఒక బస్సు, నూజివీడు నుంచి రామణక్కపేటకు ఒక బస్సును ప్రజల సౌకర్యార్థం ప్రారంభించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రజల అర్జీ మేరకు మరిన్ని కొత్త బస్సులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం పట్టణంలోని ఎంఆర్.అప్పారావు కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కోరుతూ స్థానిక పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలంటూ కరపత్రాలను పాత బస్టాండ్ వద్ద ప్రయాణికులు పంచి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దండుబోయిన చంద్రశేఖర్, నేత రంగబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నేతలు

అన్నేరామకృష్ణయ్య స్కూల్‌కు ఘన చరిత్ర

వజ్రోత్సవ వేడుకల్లో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి నూజివీడు టౌన్
మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ వజ్రోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ విద్యా సంవత్సరంలో చదువులో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎస్‌పి చేతులమీదుగా నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాలకు ఎంతోమంది ఉన్నత వ్యక్తులను అందించిన గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో గురువులకు శుభాభివందనాలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మమేకమై కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధికా రాణి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ భావిశెట్టి వీరయ్య, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, నూజివీడు డిఎస్‌పి ప్రసాద్, రూరల్ సిఐ కొప్పిశెట్టి రామకృష్ణ, ఎస్ఐ లక్ష్మణ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



వజ్రోత్సవ వేడుకల్లో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

బాధితులకు చోరీ సొత్తు అందజేత

ఎస్‌పికి పలువురి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్
పలు చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసి వారి వద్ద స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు బాధితులకు అందించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం సమావేశం మందిరంలో ఆదివారం ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి బాధితులకు అందించారు. భీమడోలు సర్కిల్ పరిధిలో, పెదవేగి సర్కిల్ పరిధిలో, ఏలూరు మూడో పట్టణ పరిధిలో 23 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. ఈ దొంగతనాల కేసుల్లో 12 మంది నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కేజీల 206 గ్రాముల బంగారు, తొమ్మిది కేజీల 40 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా ఇలా స్వాధీనం చేసుకున్న బంగారం, నగదులను ఆయా కేసుల్లో నిందితులకు శిక్ష పడిన అనంతరం బాధితులకు అందించారు. అందుకు భిన్నంగా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే 23 మంది బాధితులకు బంగారం, వెండి, నగదులను ఆయన న్యాయస్థానంలో ముందస్తు అనుమతి పొంది అందించిరు. దీంతో బాధితులు ఎస్‌పికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఇప్పటికైనా రెండు మూడు రోజుల్లో ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కేసుల్లో పూర్తి రికవరీకి సహకరించిన పోలీసు అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.



బాధితులకు చోరీ సొత్తు అందిస్తున్న ఎస్‌పి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - మండవల్లి
పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1999-2000 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఒక్కచోట చేరుకుని ఆనందంగా గడిపారు. ఎక్కడెక్కడ స్థిరపడ్డారు ఎలా ఉన్నారో తెలుసుకుంటూ ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. అలనాడు విద్య నేర్పించిన ఉపాధ్యాయులను వారి పిల్లలకు చూపించారు. అనంతరం గురువులకు మెమొంటోలను అందించి దుశ్శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి కొల్ల శ్రీనాథ్ సొంత నిధులతో పాఠశాల ఆవరణలో గుర్తుండిపోయేలా సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని తెలపడంతో అందరూ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, గొల్లపూడి సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు



నిటలాక్షరామ

నిటలాక్షరామ ప్రతిభ

ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం
పలువురి అభినందన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం
స్థానిక శ్రీ కాత్యాయనీ పీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ దాసరోజు శ్రీనివాసరావు, డాక్టర్ రసజ్ఞ దంపతుల నాలుగేళ్ల కుమారుడు నిటలాక్షరామ ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఏషియా బుక్‌లో 50 రకాల జీవుల సామూహిక నామవాచకాల (కలెక్టివ్ నౌన్స్)ను ఒక నిమిషం 57:74 సెకన్ల సమయంలో చెప్పిన తొలి వ్యక్తిగా నిటలాక్షరామ స్థానం పొందాడు. నాలుగేళ్ల వయసుకే ఇంత అద్భుత ప్రతిభ ప్రదర్శించినందుకు ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ట్రోఫీ, ప్రశంసాపత్రం, మెడల్ అందించారని దాసరోజు శ్రీనివాసరావు తెలిపారు. నిటలాక్షరామ ఇప్పటికే పది బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొంది, పదకొండో బుక్ రికార్డ్‌గా ఏషియా బుక్‌లో స్థానం పొందడం ఎంతైనా ప్రశంసనీయమని, కొయ్యలగూడెం గ్రామానికే గర్వకారణమని స్థానిక గణపతి సేవా సంఘం అధ్యక్షులు మట్టా సూర్యచంద్రరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘలాదేవి, బిజెపి మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల బొల్లినేని, కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు దార్ల రాంబాబు, జవ్వాది శ్రీనివాస్, పెద్దోజు శ్రీనివాసాచార్యులు, పలువురు పుర ప్రముఖులు నిటలాక్షను కొనియాడారు. నిటలాక్ష రామ చదువుతున్న బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ యాజమాన్యం నిటలాక్షకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి
సాంకేతిక లోపం కారణంగా ఆర్‌టిసి బస్సు మొరాయించి మార్గమధ్యలో నిలిచిపోవడంతో లగేజ్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు జంగారెడ్డిగూడెం నుంచి తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట బయలుదేరింది. జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి సాంకతిక లోపం తలెత్తడంతో నిలిచిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాకపోవడంతో చేసేదేమి లేక మార్గమధ్యలో నిలిపి వేశారు. పండుగ సమయం కావడంతో లగేజ్‌తో ఊర్లు వెళ్తున్న ప్రయాణికులకు ఏంచేయాలో తెలియక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కాలం చెల్లిన బస్సులను తిప్పడంతో ఫిట్‌నెస్ లేక ఇలా మార్గమధ్యలో నిలిచి పోతున్నాయని ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



మొరాయించిన బస్సు

ధన్యజీవి మైనేని వెంకటరత్నం

వర్ధంతి సభలో యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పత్రిక స్థాపకులు, ప్రధాన సంపాదకుడు మైనేని వెంకటరత్నం వర్ధంతి సభ స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా, రుద్రాక్షి రవికుమార్ మాట్లాడుతూ పత్రికల ద్వారా సంఘ సత్తా చాటిన మైనేని వెంకటరత్నం అవినీతి అక్రమాలపై అవిశ్రాంత పోరాటం చేసి విజ్ఞానం, వికాసం సామాజిక స్పృహల వ్యాప్తికి కలాన్ని గళాన్ని తన సర్వస్వాన్ని అర్పించిన ధన్యజీవి అన్నారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక 1975లో ప్రారంభించినప్పటి నుంచి ఆయన తుది శ్వాస విడిచే వరకు ప్రధాన సంపాదకులుగా పని చేశారన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పరిశ్రమలు స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. ఏలూరు ఇండస్ట్రియల్ ఏరియాలో పిఎంఇజిపి పథకం ద్వారా నూతనంగా ప్రారంభించిన అభి ఇంటీరియర్ మాడ్యులర్ కిచెన్ కప్ బోర్డ్ పరిశ్రమను వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద ఆధునిక యంత్ర పరికరాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు రాయితీతో రుణాలు మంజూరు చేస్తూ ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ సాధారణ కార్పెంటర్ సోదరులు ప్రభుత్వ సహాయాన్ని అందిపుచ్చుకుని పరిశ్రమను స్థాపించడం అభినందనీయమన్నారు.

చంద్రశేఖర్ సేవలు మరువలేనివి

మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాస్

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి సీనియర్ నాయకులు పెద్దిన చంద్రశేఖర్ పార్టీకి అందించిన సేవలు మరువలేనివని పోలవరం మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాస్ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టి.నర్సాపురం గ్రామానికి చెందిన పెద్దిన చంద్రశేఖర్ కుటుంబాన్ని ఆయన ఆదివారం స్థానిక టిడిపి నేతలతో కలిసి పరామర్శించారు. అనంతరం చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చంద్రశేఖర్ దశ దిన కార్యక్రమంలో జనసేన, వైసిపి, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు, మండలానికి చెందిన పలువురు ప్రముఖులు, రైతులు, ప్రజలు, తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎంతోమంది బంధుమిత్రులు, ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొని చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

నేరాలు - ఘోరాలు

పండుగకు స్వగ్రామానికి వస్తూ మృత్యుఒడికి

ప్రజాశక్తి - కలిదిండి

సంక్రాంతి పండుగను సొంతూరులో సంతోషంగా గడుపుదామని హైదరాబాద్ నుంచి బయలు దేరిన వ్యక్తి మార్గమధ్యలో మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. బంధుమిత్రులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లోడిదలంకకు చెందిన మేకా భార్గవ రమేష్ (30) హైదరాబాదు గుండ్లపోచమ్మ పల్లిలోని ఓ ప్రయివేట్ కంపెనీలో క్వాలిటీ ఇన్‌ఛార్జిగా పని చేస్తున్నాడు. రమేష్ ఇటీవలే ఐదు నెలల క్రితం పెళ్లి అయింది. భార్యను ముందుగా పండుగకు ఇంటికి పంపాడు. అనంతరం తన మిత్రునితో కలిసి శనివారం బైక్‌పై బయలుదేరాడు. గుంటూరులో మిత్రుడిని సురక్షితంగా దింపాడు. స్వగ్రామానికి పయనమయ్యాడు. గుంటూరు జిల్లా పేరేచర్ల నగరవనం వద్ద మృత్యురూపంలో వచ్చిన టిప్పర్ ఢీకొనడం తో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు ఇంటికి వస్తాడని ఎదురు చూసిన తల్లిదండ్రులకు విషాదమే మిగిలింది. ఇక కొడుకు లేడనే విషయం తెలియగానే తల్లిదండ్రులు తల్లడిల్లి పోయారు. భార్య రోదనలు వర్ణనాతీతం. బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని కోడూరు అడ్డరోడ్డు వద్ద చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... ముదినేపల్లికి చెందిన కె.కాళీ వెంకటేష్ (17) మోటూరులో ఉన్న బంధువుల ఇంటికి ఉదయం వెళ్లి తిరిగి ముదినేపల్లి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో మొగల్తూరు నుంచి గుంటూరు వెళ్తున్న బైకు, కాళీ వెంకటేష్ బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కాళీ వెంకటేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వేరే బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలు కావడంతో క్షతగాత్రుడిని గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కాళీ వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బంగారు దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో అర్ధరాత్రి ఓ బంగారు దుకాణం గోడకు కన్నం పెట్టి బంగారం, వెండి ఆభరణాలను అపహరించుకుపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటో పట్టణ పరిధిలో బంగారు దుకాణాల సముదాయాల్లో లోకేశ్వరి జ్యూయలరీస్ పేరుతో ఓ బంగారు దుకాణాన్ని మామూళ్లపల్లి రఘురాం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి యధావిధిగా దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి దుకాణం వెనుక భాగంలో గోడను తొలగించి గోడ నుంచి లోపలికి ప్రవేశించిన దుండగుడు దుకాణంలో బంగారం, వెండి ఆభరణాలను అపహరించుకుపోయాడు. లోపలికి ప్రవేశించే సమయంలో సీసీ కెమెరాలను ధ్వంసం చేశాడు. సమాచారం అందుకున్న క్లూస్ టీం ఆదివారం రాత్రి వరకు ఆధారాలు సేకరించారు. డిఎస్‌పి శ్రావణ్ కుమార్, ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ మదీనా భాషలు వివరాలు సేకరిస్తున్నారు. ఒక కిలో బంగారం, 30 నుంచి 40 కేజీల వెండి వస్తువులు దుకాణంలో ఉన్నట్లు బాధితుడు తెలియజేస్తున్నాడు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండవల్లి మోటూరు రైల్వే పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. గుడివాడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో కి మాన్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుమారు 50 ఏళ్ల వయస్సున్న ఒక వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు గమనించాడు. దీంతో రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. సూపరింటెండెంట్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుడివాడ నుంచి భీమవరం వైపు వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడినట్లు తేల్చారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని తాడినాడ పంచాయతీ శివారు సున్నంపూడిలో పేకాటస్థావరంపై దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.32,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పోతుమర్రు, గొల్లగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోడి పందేల శిబిరాలను ధ్వంసం చేశామని ఎస్ఐ తెలిపారు.

ముదినేపల్లి : పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వీరభద్రుడు తెలిపారు. మండలంలోని చిగురుకోటలో పేకాటస్థావరంపై ఆదివారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరభద్రుడు తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడు మృతి

ముసునూరు: విషం తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. వివరాల ప్రకారం... మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన ఎం.సురేష్(23) ఓ ప్రయివేట్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొన్నిరోజుల క్రితం అదే గ్రామానికి చెందిన కె.మహేష్ వద్ద నుంచి రూ.4 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చినా ఇంకా డబ్బులు అడుగుతున్నాడని సురేష్ మనస్తాపానికి గురై గత నెల 22వ తేదీన విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్రాంతి పండుగ అందరూ ఘనంగా చేసుకోవాలి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

పలుచోట్ల సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రజలందరూ సంక్రాంతి పండుగను ఘనంగా, సంతోషంగా చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. తెలుగింటి పెద్ద పండుగ సంక్రాంతి అని చెప్పారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సతీసమేతంగా విచ్చేశారు. వారిని గ్రామస్తులు ఎడ్లబండిపై గ్రామంలోకి తీసుకొచ్చారు. మాజీ సర్పంచి కొత్తగుళ్ల రాజారత్నం, టిడిపి గ్రామ అధ్యక్షులు వెల్ది నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భోగి మటలు వేయడం, మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించటం, గంగిరెద్దులను ఆడించటం, హరిదాసులు పాటలు పాడటం కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తగూడెం గ్రామానికి చెందిన హైదరాబాదులో ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగ కుటుంబ సభ్యులు చల్లగుండ్ల రఘు, చల్లగుండ్ల ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం మంత్రి పార్థసారథితో కలిసి సంక్రాంతి సంబరాలను సంతోషంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ రాజ్, నూజివీడు డిఎస్‌పి వివిఎస్.ప్రసాద్, మండల రెవెన్యూ సిబ్బంది, టిడిపి బొట్టు రామచంద్రరావు, మరిడి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని చెలికని హాస్పిటల్ వద్ద సంక్రాతి సంబరాలు నిర్వహించారు.



చాట్రాయిలో...

గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటం, హరిదాసుల పాటలు, భోగి మంటలు వేశారు. చిన్న పిల్లలకు భోగి పండ్లు వేశారు. ఈ వేడుకల్లో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలందరూ సంక్రాతి పండుగను కుటుంబాలతో సంతోషంగా జరుపుకోవాలన్నారు.

సంక్రాంతి సంబరాలు

భీమడోలు : భీమడోలు గీతాంజలి కళాశాలలో, పాతూరు గ్రామంలో జనసేన, కూటమి పక్ష నాయకుల పర్యవేక్షణలో సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాతూరులో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుతో పాటు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన గంగిరెడ్ల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. గీతాంజలి కళాశాలలో విద్యార్థులు సాంప్రదాయ రీతిలో దుస్తులను ధరించి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురి మన్ననలు పొందాయి. భోగి మంటల చుట్టూ ప్రదర్శించిన నృత్యరూపకాలు పలువురుని ఆకట్టుకున్నాయి. ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చిన్నారులను మహిళలను ఆలరింపచేశాయి. వివిధ సందేశాలతో కూడిన సంక్రాంతి ముగ్గులు విద్యార్థుల్లో నిబిడీకృతమైన ప్రతిభను కనపరిచాయి. కరస్పాండెంట్ ఎం.గౌతమ్‌కుమార్, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఉదయ్ ముగ్గుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ తగురీతిలో సత్కరించారు.

నేడు పలు పోటీలు

కుక్కునూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రామసింగారం పాఠశాల ఆవరణలో జరిగే ఆటల పోటీలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్రరావు కోరారు. వారం రోజులుగా మండల రామిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వారి కుమారుడు మండల శ్యామ్ సుందర్ రెడ్డి సహకారంతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయి వాలీబాల్, కబడ్డీ, షటిల్, క్రికెట్, పాటల పోటీలు నిర్వహించామని, గెలుపొందినవారికి భోగి రోజు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. భోగి రోజు మహిళలకు ముగ్గుల పోటీలు, లెమన్, స్పూన్, మ్యూజికల్ చైర్ వంటి పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామం గీత కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సమైక్య ఆధ్వర్యంలో మహిళలకు, బాల బాలికలకు ముగ్గుల పోటీలు, టల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి పొట్టేలు పెంటయ్య తెలిపారు. 14వ తేదీ మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి చాటపర్రు గీత కాలనీలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

యువత కోసం పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న ఐదేళ్లల్లో దేశంలోని టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రారంభమైందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్రబాబు అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను 12 నెలలు పారిశ్రామిక అనుభవం అందించాలని సంకల్పించిందని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ స్కీమ్ అర్హత సాధించడానికి దరఖాస్తుదారులు తమ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఐటిఐ నుంచి సర్టిఫికేట్, పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ నుంచి డిప్లొమా బిఎ, బిఎస్‌సి, బికామ్, బిసిఎ, బిబిఎ బిఫార్మ్, బి.టెక్ వంటి డిగ్రీని కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ లేదా దూరవిద్య ప్రోగ్రామ్‌లలో నమోదు చేసుకున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. భారత ప్రభుత్వం ద్వారా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద చేరే ప్రతిఒక్కరికీ బీమా కవరేజీ అందిస్తుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు https://pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో ఆధార్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి 12 నెలల పాటు రూ.ఐదు వేల చొప్పున అందిస్తారని, ఏకకాల గ్రాంటు కింద రూ.ఆరు వేలు కూడా ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9030227668 సంప్రదించాలని తెలిపారు.

రైతాంగ సమస్యలపై 17న ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న విజయవాడలో జరుగుతున్న ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక అన్నే భవనంలో రైతు సంఘం జిల్లా నాయకులు ధర్నా కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 17న జరిగే విజయవాడ ధర్నా విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ


ప్రజాశక్తి - కుక్కునూరు

మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల కమిటీ నిర్మాణం, జెండా దిమ్మ నిర్మాణం ప్రతి గ్రామంలో వేగవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విస్సంపల్లి సిద్ధు మాదిగ కోరారు. మండల కేంద్రంలో రాయి రవి మాదిగ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఎంఆర్‌పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల ఏడో తేదీన హైదరాబాద్‌లో లక్ష డప్పులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భానుప్రసాద్ మాదిగ, శ్రీను మాదిగ, రాంబాబు, వీరబాబు మాదిగ, సురేష్ మాదిగ, చిల్లిముంత వెంకటేశ్వర్లు మాదిగ, కొండయ్య మాదిగ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి

మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్ కుమార్

నూజివీడు టౌన్ : పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. నూజివీడు ఎంఆర్.అప్పారావు కాలనీలో అమెరికన్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైద్య శిబిరంలో జనరల్, కంటి, గుండె, ఊపిరితిత్తుల పరీక్ష కేంద్రాలను సందర్శించారు. మంత్రి పార్థసారథి నేత్ర పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బుల్లేక ఏ ఒక్క పేదవాడు మెరుగైన వైద్యానికి దూరం కాకూడదదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రయివేట్, స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేసే మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నూజివీడు అమెరికన్ హాస్పటల్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత నాగరిక సమాజంలో మానవుల జీవన శైలి, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా అనేక రోగాలు వస్తున్నాయన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం వైద్యం చేసుకున్న ప్రతిఒక్కరూ సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చన్నారు. పేదలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని చెప్పారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎంపీ

యువతకు వివేకానంద స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - చింతలపూడి

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. జాతీయ యువజన దినోత్సవాన్ని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ యువత నూతన ఆలోచన లతో ముందుకెళ్లాలన్నారు.

టి.నరసాపురం : మండలంలోని కృష్ణాపురం ఎంపిపి పాఠశాల ఆవరణలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ ప్రపంచ సర్వ మత మహా సభల్లో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెప్పిన మహా మేధావి స్వామి వివేకానంద అని అన్నారు. జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ టి.నరసాపురం మండలంలో అవసరమున్న పాఠశాలల్లో స్వామి వివేకానంద విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తేజావత్ నవీన్, భూక్యా బిగనాధం, భూక్యా పాంచ, భూక్యా కృష్ణ, ధరావత్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సేవా సంస్థ భీమడోలు మానవత శాఖ చేపడుతున్న సేవా, సంక్షేమ కార్యక్రమాలకు తమ వంతు సహకారాన్ని, తగు ప్రోత్సాహాన్ని అందించాలని శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ కోరారు. భీమడోలులో ఆదివారం నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక మహిళకు రూ.ఐదు వేల నగదు సహాయం, నిత్యావసర వస్తువులతో పాటు, భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ స్టోర్స్ సౌజన్యంతో బాధితురాలైన మహిళ కుటుంబానికి దుస్తులు అందించారు. మల్కీ మహమ్మద్ పురంలో నిర్వహించిన వేరొక కార్యక్రమంలో సంస్థ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ మానవత శాఖ ద్వారా చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని 150 మంది వయోవృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. దీనికి అదనంగా ఆయన తండ్రి వీర వెంకట సత్యనారాయణ జయంతి పురస్కరించుకుని, ఆయన సంస్మరణార్థం వృద్ధులకు తుండ్లు, మంకీ క్యాపులు, స్కార్ఫ్‌లను సంస్థ జిల్లా ప్రతినిధులు అప్పక రాంబాబు, టివి.ఉమామహేశ్వరరావు చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ శాఖకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

'కిసాన్ అంగడి'తో రైతులకు, వినియోగదారులకు మేలు

ప్రజాశక్తి - చింతలపూడి

కిసాన్ అంగడి సంస్థ రైతులకు, వినియోగదారులకు ఒక మంచి వేదికను అందించేందుకు ఏర్పాటు చేసినట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఆయన క్యాంపు కార్యాలయం వద్ద కిసాన్ అంగడి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం లోగోను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా రైతులు తమ ఉత్పత్తులను ప్రత్యక్షంగా విక్రయించగలుగుతారన్నారు. దీంతో వారికి మెరుగైన ధరలు లభిస్తాయని చెప్పారు.

గోపాలకృష్ణ అభినందనీయులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీ సర్పంచిగా 27 ఏళ్ల పాటు ఏకధాటిగా సేవలందించిన మంచెం గోపాలకృష్ణ అభినందనీయులని, పాలకులకు ఆదర్శప్రాయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమడోలు గ్రామపంచాయతీ ఆవరణలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన అభిమానులు, సహచరులు ఆయన విగ్రహాన్ని భీమడోలు గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేశారు. విగ్రహం ఏర్పాటు చేసి రెండో సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో ఆయన సంస్మరణార్థం ఆదివారం విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, అభిమానులు నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామపంచాయతీలో పనిచేసే సిబ్బందికి, కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

4 నుంచి గాలాయగూడెం తిరునాళ్లు

ప్రజాశక్తి - పెదవేగి

గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి మహోత్సవాలు - 2025 వాల్‌పోస్టర్‌ను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా అచ్చమ్మ పేరంటాల తల్లి మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత దెందులూరు మండలాధ్యక్షులు ఏనుగు రామకృష్ణ, టిడిపి గాలాయగూడెం అధ్యక్షులు పూజారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మద్దాల దయానందరాజు, జనసేన నాయకులు పూజారి వెంకటరత్నం నాయుడు, పెద్దిశెట్టి రాఘవులు, తెలుగు యువత గ్రామ అధ్యక్షులు దోరేపల్లి రమేష్, బూత్ కన్వీనర్ శ్రీకాకొల్లు నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల డీలర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో మూడు చౌక దుకాణాల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్ టిఎస్.సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం పంచాయతీలోని కొల్లివారిగూడెం చౌక దుకాణం ఒసి, బంధంచర్ల చౌక దుకాణం ఎస్‌సి, కేతవరం ఒసి ఇడబ్ల్యుఎస్ విభాగాలకు కేటాయించినట్లు ఆయన తెలిపారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగి ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

60 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో కోడిపందేల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా 60 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సంక్రాంతి పేరుతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. కోడిపందేలు నిరోధించే క్రమంలో మండలంలోని 15 పంచాయతీల పరిధిలో ఇప్పటికే 60 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహశీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు.

కల్తీ మద్యం పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సంక్రాంతి పండుగ సందర్భంగా కల్తీ మద్యం, నాటుసారా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్తీ మద్యం బయట ఎవరైనా అమ్ముతుంటే ఆ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కి తెలియచేయాలనీ, లేదంటే 9440902425కి ఫోన్‌చేసి తెలియచేయాలని పేర్కొన్నారు. నాటు సారా తయారీదారులకు బెల్లం సరఫరా చేయవద్దని బెల్లం వ్యాపారులను హెచ్చరిస్తున్నామని తెలిపారు.

సమరానికి పందెం కోళ్లు సై

సిద్ధమైన పందెంరాయుళ్లు

భారీఎత్తున నిర్వాహకుల ఏర్పాట్లు

ప్రజాశక్తి - మండవల్లి

సంక్రాంతికి కోడి పందేలు, పేకాట, గుండాట, కోత ముక్క, చిత్తులాట వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్వాహకులు రెడీ అయిపోయారు. ఇప్పటికే స్థలాన్ని సిద్ధం చేసుకుని భారీ స్థాయిలో బరులను ఏర్పాటు చేశారు. మండవల్లి మండలంలో చింతపాడు, పులపర్రు, భైరవపట్నం, పెరికేగూడెం, లింగాల, ఇంగిలిపాకలంక గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహించేందుకు నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సారి కోడిపందేలను, పేకాటను రాత్రి వేళల్లో కూడా విద్యుత్ దీప కాంతుల్లో నిర్వహించేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తుంది. ఈసారి కోడిపందేలు, పేకాట ఆరు రోజులు నిర్వహిస్తున్నామని, ఆటగాళ్లకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారని ప్రచారం విస్తృతంగా సాగుతుంది. దీనిపై ఎస్ఐ రామచంద్రరావును వివరణ కోరగా కోడిపందేలు, పేకాట నిర్వహించడం చట్టరీత్య నేరమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బరులను ఇప్పటికే ధ్వంసం చేశామని, గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు.

ముదినేపల్లి : సంక్రాంతి పందేల నిర్వహణకు మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే మండలంలో ఐదు గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలకు బరులు సిద్ధం చేశారు. బరుల వద్ద ఆటలతో పాటు బిర్యానీ పాయింట్లు, శీతల పానీయాలు, బెల్ట్ దుకాణాలను సొంతం చేసుకునేందుకు ఎక్కువమంది పోటీ పడుతున్నారు. కోడిపందేలతో పాటు గుండాటల్లో పండుగ మూడు రోజులు రూ.కోట్లలో డబ్బులు చేతులు మారనున్నాయి. మండలంలో బరులు ఏర్పాటుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కూటమిలో మూడు ప్రధాన పార్టీలు ఉండడంతో బరులు తమకు కావాలంటే తమకు కావాలంటూ నాయకులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఒకపక్క సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ పోలీసులు హెచ్చరిస్తూ గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. అయితే పందేల నిర్వాహకులు మాత్రం పోలీసు వారి హెచ్చరికలను ఏమాత్రం ఖాతార్ చేయకుండా బరులు ఏర్పాటు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. బరుల వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తూ రాత్రి సమయంలో కూడా జూదాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని పెదపాలపర్రు హైస్కూల్ ఎదురుగా మూడు పార్టీలకు చెందిన రంగులతో బరిని అందంగా తీర్చిదిద్దారు. పామర్రు - దిగమర్రు ప్రధాన రహదారిలో బరిని ఏర్పాటు చేశారు. ఏలూరు ఎంపీ, కైకలూరు ఎంఎల్ఎ ఫ్లెక్సీలతో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో ఇప్పటికే భారీ సంఖ్యలో పందెం పుంజులను సిద్ధంగా ఉంచారు. భోగి రోజు సోమవారం నుంచే మండలంలో పందేల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసులు మాత్రం అన్నీ తెలిసిన తమకు ఏమీ తెలియనట్టు, బరులు ఎక్కడా తమకు కనబడనట్లు వ్యవహరిస్తున్నారని, పలుచోట్ల తూతూ మంత్రంగా బరులు ధ్వంసం చేస్తున్నట్లు ఫొటోలు దిగి చేతులు దులుపుకుంటున్నారని పలువురు ప్రజలు అంటున్నారు.



మండవల్లి మండలంలో ఏర్పాటు చేసిన బరి

పోలవరం : పందెం కోళ్లు సమరానికి సిద్ధం అంటున్నాయి. ప్రజల ఆధ్యాత్మిక పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ పందెం రాయుళ్లు మాత్రం కోడిపందేలు వేయడానికి సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా అని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారు. కొందరు మేలుజాతి కోళ్లను సుదూర ప్రాంతాల నుంచి తీసుకొస్తారు. వీటికి తర్ఫీదు ఇవ్వడానికి ఒక వ్యక్తిని ఏర్పాటు చేస్తారు, సంవత్సరం పొడుగునా కోడిపుంజులను తయారుచేసి పందెం వేయడానికి సిద్ధంగా ఉంచుతారు. ఎల్ఎన్‌డి.పేట, పోలవరం, పట్టిసీమ, గూటాల తదితర ప్రదేశాల్లో కోడిపందేలకు పెట్టింది పేరు. ఇక్కడ భారీ స్థాయిలో కోడిపందేలు జరిగి రూ.లక్షలు చేతులు మారుతుంటాయి.

ఇక పండగ విషయానికి వస్తే కుటుంబ సభ్యులంతా నూతన వస్త్రాలు ధరించి రకరకాల ఆహార పదార్థాలు తయారు చేసుకుని బంధుమిత్ర సమేతంగా ఆరగిస్తూ ఉంటారు. తమ తమ ఇళ్లకు వచ్చిన బంధువులతో కలిసి రకరకాల పిండి వంటలు చేసి నిల్వచేసి తినేలా ఉంచుకుంటారు.

చింతలపూడి : గతంలో జనవరి వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున పండుగ వాతావరణం నెలకొనేది. కొత్తగా పెళ్లి అయిన వారు, మర్యాదల కోసం అత్తగారిళ్లు సిద్ధమవుతుంటాయి. రకరకాల పిండివంటల తయారీలో మునిగిపోతారు. మహిళలు ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దులు ఇలా సంక్రాంతి సంబరాల గురించి ఎంత చెప్పుకున్న తక్కువే. కాని నేడు గ్రామీణ ప్రాంతాల్లో ఆ పండుగ వాతావరణం కనిపించటం లేదు. దూరప్రాంతాల్లో ఉన్న బంధువులు హడావిడిగా వస్తారు, వెళ్లిపోతారు. వచ్చిన మూడు రోజులు కూడా కోడిపందేలు అంటూ పరిగెడుతునారు తప్ప కుటుంబంతో గడపని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు సరదాగా సాగిన కోడిపందేలు.. ఇప్పుడు మంచి బిజినెస్ అయ్యిందనే కామెం ట్స్ వినిపిస్తున్నాయి. అందుకే చాలామంది కోళ్లను పెంచ డం, వాటిని విక్రయించడం, బరులు నిర్వహించడం ద్వారా రూ.కోట్లు కూడబెడుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.

పందేల కోసం కోడిపుంజులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. బలవర్ధక ఆహారాన్ని కూడా అందిస్తారు. అయితే ఇందులో పందేనికి పనికొచ్చే పుంజులను గుర్తించడం ఒక కళ. ఇక్కడే తొలి అడుగు పడుతుంది. నిర్వాహకులు కోళ్ల పందెం కట్టినందుకు కొంత, గెలిచిన వారి నుంచి కొంత వాటా తీసుకుంటారు. అంతేకాకుండా బరుల వద్ద సైకిల్, టూవీలర్ పార్కింగ్ నుంచి, మద్యం, ఇతర దుకాణదారుల వరకు పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. దీంతో పందేల పేరుతో సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అతి తక్కువ రోజుల్లో రూ.లక్షలు కూడబెట్టుకునే అవకాశం ఉండటంతో ఈ సంస్కృతి పెరుగు తోంది. పండుగ సంప్రదాయం పేరుతో పందేలు నిర్వహిస్తుండటంతో..ఆపేవారు ఉండరని నిర్వాహకులు భావిస్తున్నారు.

చింతలపూడికి బడా వ్యాపారులు

కోడి పందేలను చూడటానికి, పందేలు కాయడానికి రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి తెలంగాణ నుంచి బడా వ్యాపారులు చింతలపూడికి వస్తారు. కేవలం పండుగ రోజుల్లోనే రూ.లక్షలు చేతులు మారనున్నాయనే టాక్ ఉంది. ఈ ఏడాది 12 నుంచి 15 వరకు నాలుగు రోజులు కోడి పందేల నిర్వహించడానికి ఏర్పాట్లు చకాచకా చేస్తున్నారు.